


# ఏఐఎంఐఎం కౌన్సిలర్ అదృశ్యం

## పోలీసులకు ఫిర్యాదు చేసిన చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫిఖార్ అలీ

**ప్రజానావ, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ పట్టణంలో ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ గత మూడు రోజులుగా కనిపించకపోవడం కలకలం రేపింది. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫిఖార్ అలీ సోమవారం కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తక్షణ చర్యలు తీసుకుని అతని ఆచూకీ కనుగొనాలని పోలీసు అధికారులను కోరారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాగజ్‌నగర్ ఏఐఎంఐఎం ప్రధాన కార్యదర్శి జావేద్ మల్నాస్, సంయుక్త కార్యదర్శి అబెద్ ఖాద్రి తదితరులు ఉన్నారు.

# జాతరలో ఎన్‌ఎస్‌ఎస్ సేవలు




**ప్రజానావ, కాగజ్‌నగర్:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈస్ గాం శివ మల్లన్న స్వామి జాతరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తూడూరు దత్తాత్రేయ ఆధ్వర్యంలో 55మంది వాలంటీర్లు భక్తులకు క్యూ లైన్ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు పలు సేవలు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె శ్రీదేవి ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల సేవాభావాన్ని అభినందించారు. సమాజ సేవలో యువత ముందుండాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు డి సాయికృష్ణ, ఎం సతీష్, సంతోష్, విద్యార్థులు రతన్‌కుమార్, మణికాంత్, సుష్మ, లావణ్య, పోచూబాయి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలతో బిక్షాటన చేయించడం నేరం



**ప్రజానావ, కాగజ్‌నగర్:** పిల్లలతో బిక్షాటన చేయించడం తీవ్రమైన నేరమని డీసీపీఓ బూర్ల మహేష్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఇస్గామా శివాలయం జాతర సందర్భంగా బాలల చేత గాంధీ వేషాధారణ చేయించి భిక్షాటన చేయిస్తున్న ఘటనపై సోమవారం చైల్డ్ హెల్ప్‌లైన్, పోలీస్ శాఖ, స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. బిక్షాటనలో ఉన్న పిల్లలను గుర్తించి రెస్క్యూ చేశారు. రక్షించిన బాలబాలికలను వారి తల్లిదండ్రులు, పోషకులతో కలిసి కౌన్సిలింగ్ నిర్వహించారు. విద్య, సంరక్షణ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం అమూల్యమైన దశ అని, ఆ సమయంలో పిల్లలను బిక్షాటనకు, ఇతర పనులకు వినియోగించడం వారి మౌలిక హక్కులను ఉల్లంఘించడం అవుతుందని పేర్కొన్నారు. 14 సంవత్సరాల లోపు బాల బాలికలు తప్పనిసరిగా పాఠశాలలో ఉండాలని, వారి విద్యను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతరలు, వేడుకలు, పండుగల సమయంలో పిల్లలను భిక్షాటన, వీధి ప్రదర్శనలలో పాల్గొనకుండా తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కళ్యాణ్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి వి శ్యామ్ రావు, స్కౌట్స్ మాస్టర్ ఎం మల్లేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ ఝాన్సీ, కేస్ వర్కర్ వెంకటేశ్వర్లు, ఎన్‌సీసీ వాలంటీర్లు, బాలల సంరక్షణ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే దంపతుల పూజలు



**ప్రజానావ, కాగజ్‌నగర్:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆయన సతీమణితో కలిసి ఇస్గాం శివ మల్లన్న ఆలయాన్ని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు వారిని ఆత్మీయంగా స్వాగతించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా కోనప్ప ఆలయానికి వచ్చిన భక్తులకు చల్లటి మజ్జిగ పంపిణీ చేసి సేవా కార్యక్రమం నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. స్థానిక నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. భద్రతా దృష్ట్యా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో మహాశివరాత్రి వేడుకలు జరిగేలా చర్యలు చేపట్టారు.

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షల నిర్వహణ

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ప్రజానావ, ఆదిలాబాద్:** ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్న పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. ఈసారి విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పీరియడ్ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమైనప్పటికీ 9.5 గంటల వరకు విద్యార్థులను అనుమతిస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 31 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, ప్రతి కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించామని తెలిపారు. అదనంగా 9 మంది సీఎస్‌ఓలను నియమించినట్లు చెప్పారు. ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల రవాణా విషయంలో అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలోని 13 పోలీస్ స్టేషన్లలో స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి భద్రత మధ్య రవాణా చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, డిజిటల్ గడియారాలు, మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు అధికారులు, సిబ్బందికీ వర్తిస్తాయని తెలిపారు. పరీక్షల సమయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ప్రత్యేక బస్సులు నడపాలని, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స కిట్లతో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 అమలు చేసి, సీసీ కెమెరాల ద్వారా నిఘా కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్లను వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పరీక్షలు ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గణేష్ జాదవ్, ఆర్టీసీ, వైద్య, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ఆత్మవిశ్వాసంతో ఆడి జిల్లా పేరు నిలబెట్టాలి

**ప్రజానావ, ఆదిలాబాద్ :** ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో క్రీడల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జిల్లా కీర్తిని పెంచాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆకాంక్షించారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు బయల్దేరిన విద్యార్థుల బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శారీరక, మానసిక వైకల్యాలను అధిగమించి క్రీడల్లో రాణించడం అభినందనీయమని అన్నారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని వెలికితీసి పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత ఫలితాలు సాధ్యమని తెలిపారు. క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని జిల్లాకు పతకాలు సాధించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు రఘురమణ, సుజాత్ ఖాన్, ఇతర అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పులాజీ బాబా ధ్యాన కేంద్రంలో శివరాత్రి మహోత్సవం





**ప్రజానావ, జైనూర్:** మండలంలోని పట్నాపూర్ శ్రీ పులాజీ బాబా ధ్యాన కేంద్రంలో 2రోజులుగా భజన కీర్త నలతో మహాశివరాత్రి మహోత్సవం నిర్వహించారు. ముం దుగా బాబా సతీమణి ఇంగిలే దుర్పత బాయి తనయులు కేశవ్ రావు వమాన్ రావు చేతుల మీదుగా సమాధి పూజ, జ్యోతి ప్రజ్వలన, గ్రంథపూజ చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థాన్ ఆద్యక్షుడు కేశవ్ రావు ఇంగిలే మాట్లాడుతూ ఇప్పటికి బాబా బోధనలు ఆచరిస్తూ ధ్యానధారణ చేస్తూ శాంతి మార్గంలో నడుస్తున్నారని అన్నారు. అనంత విశ్వంలో మనం ఉన్నాం.. మనలో విశ్వం దాగి ఉంది.. అదే ఈశ్వర రూపం అని బాబా చెప్పేవారని, ఇప్పటికి ఎందరో భక్తులు బాబా బోధనలు ఆచరిస్తూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి సన్మార్గంలో నడుస్తున్నారని తెలిపారు. మహారాష్ట్ర ఉమార్కేడ్ మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబా బోధనలు నేటికీ చిరస్మరణీయమని, పులాజిబాబా మన మధ్యలో లేకున్నా ఆయన పంచత్వాలలో విలీనమై ఉన్నారన్నారు. బాబా మార్గంలో నడుస్తూ నేను రెండు సార్లు ఎమ్మెల్యే గా ప్రజలకు సేవలు అందించడం జరిగిందన్నారు. మహాశివరాత్రి మహోత్సవం ఆదివారం నుంచి సోమవారం వరకు ఘనంగా నిర్వహించారు. సంస్థానంలో మహారాష్ట్ర, తెలంగాణ, రాజస్థాన్, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు శ్రీ సిద్దేశ్వర ట్రస్ట్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఇంగిలే వమాన్ రావు, ఇంద్రవెల్లి మార్కెట్ చైర్మన్ ముఖడే ఉత్తమ్, స్థానిక సర్పంచ్ కందారే లక్ష్మీ, బాలాజీగూడ మమడ సర్పంచ్ కుంరా యశోద కేశవ్ రావు, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, గంగారాం, నారాయణ్, భాగవంత్ రావు, ముఖడే విష్ణు, భక్తులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన గురుకుల విద్యార్థినులు

**ప్రజానావ, తిర్యాణి:** మండల కేంద్రంలోని చింతపల్లి గురుకుల పాఠశాలలో మంచినీటి సమస్య తీవ్రమవడంతో విద్యార్థినిలు సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. గత రెండు రోజులుగా స్నానాలకు, ఇతర అవసరాలకు సరిపడా మంచినీరు అందక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో రోడ్డెక్కాల్సి వచ్చిందని తెలిపారు. బెల్లంపల్లి నుంచి ప్రతిరోజూ ప్రయాణం చేసే ప్రిన్సిపాల్ సమయపాలన పాటించడం లేదని, విద్యార్థినిల సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పైగా చిన్న విషయాలకే ఎక్కువగా శిక్షలు విధిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. “ఆడపిల్లలమైన మాకు కనీసం స్నానానికి నీళ్లు కూడా లేకపోవడం చాలా బాధాకరం” అంటూ విద్యార్థినిలు కన్నీటి పర్యంతమయ్యారు. మంచినీటి బకెట్లు, డబ్బాలు చేతబట్టి గురుకుల పాఠశాల నుంచి తిర్యాణి మెయిన్ రోడ్ మీదుగా కొమరం భీమ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఉదయం ప్రారంభమైన ఈ నిరసన మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ చేను కుమార్ విద్యార్థినిలకు స్నాక్స్, మంచినీటిని అందజేసి టెంటు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా గుణవంత్ రావు మాట్లాడుతూ సమస్యపై ఎన్నోసార్లు అధికారులకు వివరించినప్పటికీ స్పందన లేకపోవడంతోనే పిల్లలు రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి విద్యార్థినిలకు తగిన సౌకర్యాలు కల్పించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, నాయకులు, విద్యార్థినిల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





